# విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, డిసెంబర్18: ప్రస్తుతం శీతాకాలం కావడంతో చలి ప్రభావం ఎక్కువగా ఉందని, ఆశ్రమ పాఠశాల, గురుకులాల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన మాట్లాడారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, తన పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరిస్తూ, మిగతా వాటిని సంబంధిత యూనిట్ అధికారులకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను అర్హులైన గిరిజనులకు అందజేయాలని ఆదేశించారు. ఎక్కువగా పోడు సమస్యలు, గిరిజన గ్రామాల్లో వ్యవసాయం చేసుకునేందుకు అవసరమై కరెంట్, మోటర్, నూతనంగా మత్స్యకార సోసైటీల ఏర్పాటు, వైద్యం, వివిధ రకాలైన ఉపాధి పథకాల కోసం, వృత్తి శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఎస్‌వో సురేశ్‌బాబు, ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్, డీటీ ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్, ఏపీవో పవర్ మునీర్ పాషా, ఉద్యాన అధికారి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




భద్రాచలం: అర్జీలు స్వీకరిస్తున్న పీవో ప్రతీక్ జైన్, ఆళ్లపల్లి: సమస్యలను పీవోకు వివరిస్తున్న ఎంపీపీ మంజుభార్గవి

**సమస్యలు పరిష్కరించాలి..**

ఆళ్లపల్లి, డిసెంబర్ 18: మండలంలోని రామాంజిగూడెం పంచాయతీ రాయిలంక గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి ఆధ్వర్యంలో సోమవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో పీవో ప్రతీక్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాయిగూడెం గ్రామంలో అర్హులైన వారి భూములకు పట్టాలు రాలేదని, అసైన్డ్ భూములకు పోడు పట్టాలు రాలేదని, తదితర అంశాలను పీవోకు వివరించారు. నడిమిగూడెం పంచాయతీ చీమల గుంపునకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని, రాయిపాడు పంచాయతీ ముత్తాపురం గ్రామంలో పూసం రఘపతి ఇంటి నుంచి ఆర్ అండ్ బీ రోడ్డు వరకు డ్రైనేజి మంజూరు చేయాలని, ఊరవాగుపై కల్వర్టు నిర్మించిలని, రాయిగూడెం గ్రామంలో తాగునీరు సౌకర్యం, బాటన్ననగర్– రాయిగూడెం గ్రామంలో రహదారి నిర్మాణం మధ్యలో ఉన్న వాగుపై కల్వర్టు నిర్మాణం చేపట్టాలని పీవోను కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు ఎంపీపీ తెలిపారు.

## అయ్యప్పలకు అన్నదానం

ఆళ్లపల్లి,డిసెంబర్18: మండలంలో అయ్యప్ప స్వాములకు నేహా ఎర్త్ మూవర్స్ ఓనర్ ముక్తార్ పాషా సోమవారం అన్నదాన నిర్వహించారు. ప్రతి సంవత్సరం తాను అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు వెంకటేశ్వర్లు, జగన్నాథం, నవీన్, ప్రశాంత్, నాగరాజు, గణేశ్, లింగయ్య, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మణుగూరుటౌన్, డిసెంబర్ 18: మండలంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబాకర్ చెక్కులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తారని తహసీల్దార్ రాఘవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## నిస్వార్థంగా పనిచేసే టీబీజీకేఎస్‌ను గెలిపించాలి

మణుగూరుటౌన్, డిసెంబర్ 18: సింగరేణిలో త్వరలో జరుగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో నిస్వార్థంగా పనిచేసిన టీబీజీకేఎస్‌ను కార్మికులు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మణుగూరు ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షుడు వూకంటి ప్రభాకర్‌రావు అన్నారు. సోమవారం మణుగూరు ఓసీలో పిట్ సెక్రెటరీ ఇంతియాజ్‌పాషా అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులతో మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నేతృత్వంలో కార్మిక వర్గానికి అవసరమైన హక్కులను, సంక్షేమ పథకాలను టీబీజీకేఎస్ హయాంలో సాధించామన్నారు. వారసత్వ ఉద్యోగాలు ఇవ్వకూడదని సుప్రీం కోర్టు తేల్చిచెప్పినప్పటికీ కేసీఆర్ అనేక మంది న్యాయనిపుణులను సంప్రదించి సింగరేణిలో కారుణ్య నియామకాల పేరిట వారసులకు ఉద్యోగాలు ఇప్పించడం జరుగుతుందని, నేడు 1,943మంది యువ కార్మికులు సింగరేణిలో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. జాతీయ సంఘాలు సింగరేణి కార్మికులకు సాధించి పెట్టింది, ఒరగబెట్టింది ఏమీలేదన్నారు. కార్మిక సంక్షేమ వారధిగా పనిచేసే టీబీజీకేఎస్‌ను ఈనెల 27న జరుగుతున్న ఎన్నికల్లో బాణం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ అబ్దుల్ రవూఫ్, బ్రాంచి నాయకులు వీరభద్రయ్య, ఎస్‌వీఎస్ ఎన్.వర్మ, మునిగెల రమేశ్‌బాబు, సాగర్, బిక్కసాని రవి, సుధాకర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రభాకర్‌రావు

## భద్రాద్రి రామా పేరుతో జిల్లాను ఏర్పాటు చేయాలి

భద్రాచలం, డిసెంబర్18: రాష్ట్ర విభజనతో భద్రాచలం ప్రాంతం నష్టపోయిందని, భద్రాచల ప్రాంతం అభివృద్ధి కోసం వెంకటాపురం, వాజేడు మండలాలను భద్రాచలంలో కలిపి భద్రాద్రి రామా పేరుతో నూతన జిల్లాను ఏర్పాటు చేయాలని భారత్ చైతన్య యువజన పార్టీ నాయకుడు పూనెం ప్రదీప్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 8మండలాలతో ఉన్న భద్రాచలం నియోజకవర్గాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 7మండలాలను ఆంధ్రాలో విలీనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాల పునర్వ్యభజనలో భద్రాచలం నియోజకవర్గంలోని వెంకటాపురం, వాజేడు మండలాలను ములుగు జిల్లాలో కలపడంతో భద్రాచలం మండలం ఏకాకిగా మిగిలిందన్నారు. ప్రస్తుతం భద్రాచలం నియోజకవర్గంలో కేవలం దుమ్ముగూడెం, చర్ల రెండు మండలాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా భద్రాద్రి రామా జిల్లాను ఏర్పాటు చేయాలని ఆయన ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

## ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి

మణుగూరుటౌన్, డిసెంబర్ 18: రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు నేపథ్యంలో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని ఐఎఫ్‌టీయూ మణుగూరు ఏరియా నాయకుడు సాదనపల్లి రవి ప్రభుత్వాన్ని కోరారు. ఆయన సోమవారం సురక్షా బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం ఆటో డ్రైవర్ల పాలిట శాపంగా మారిందన్నారు. పెరిగిన డీజిల్, ఆటో విడి భాగాలు నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి ఉచిత పథకంతో మూలిగేనక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆటో డ్రైవర్లకు న్యాయం చేసే విధంగా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు నాగేశ్వరరావు, శంకర్, శ్రీను, చారి, సాంబ, సూర్యనారాయణ, రాములు, రషీద్, భద్రం, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆటో డ్రైవర్లు

## గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలి

కరకగూడెం, డిసెంబర్ 18: ఏజెన్సీ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్ల నుంచి జీవనం సాగిస్తున్న గిరిజనేతరుల సమస్యలను పరిష్కరించాలని గిరిజనేతరుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రాళ్లవాగు వద్ద ఏర్పాటు చేసి న సమావేశంలో వారు మాట్లాడారు. 53 ఏళ్ల నుంచి గిరిజనేతరులపై ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయన్నారు. 80 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న పట్టా భూములు, పోడు భూములపై ఎలాంటి భద్రత, భరోసా లేకుండా జీవిస్తున్నామన్నారు. ఏజెన్సీలో ఇల్లు కట్టుకోవాలన్న, భూములు అమ్ముకోవాలన్నా, కొనాలన్నా అనేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొంపెల్లి పెదరామలింగం, అక్కిరెడ్డి సంజీవరెడ్డి, వంగరి సతీశ్, నాగేశ్వరరావు, మధు, సురేశ్, కృష్ణ, రంజిత్, వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, మల్లారెడ్డి, లింగయ్య, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## బావిలో మృతదేహం లభ్యం

భద్రాచలం, డిసెంబర్18: పట్టణంలోని సూపర్ బజార్ సమీపంలో ఉన్న బావిలో ముస్లిం యువకుడి మృతదేహం లభ్యమైంది. సోమవారం మధ్యాహ్నం స్థానికులు యువకుడి మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ల్యాబ్ టెక్నిషియన్‌గా పనిచేస్తున్న కరీంగా గుర్తించినట్లు సమాచారం.

## ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

మణుగూరుటౌన్, డిసెంబర్ 18: పట్టణంలో వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయని, ట్రాఫిక్ సిగ్నలింగ్ సిస్టంను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ యూత్ నాయకులు, అడ్వకేట్ రుద్ర వెంకట్ మణుగూరు డీఎస్పీకి రాఘవేంద్రరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలం, డిసెంబర్ 18: గిరిజన సంక్షేమ విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రొగెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు, రాష్ట్ర కౌన్సిలర్ భట్టా ప్రసాదరావు, ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యుడు మునిగడప రామాచారి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిన టీపీటీఎఫ్ కార్యాలయంలో భద్రాచలం డివిజన్‌లోని అధ్యక్ష, కార్యదర్శులు, జోనల్ బాధ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతినెల 1న జీతాలు చెల్లించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీ సత్తిబాబు, పీ గంగరాజు, ఎస్ కృష్ణబాబు, బీ రవి, బీ భాస్కర్ పాల్గొన్నారు.

## భగీరథ పైప్‌లైన్ లీక్

పర్ణశాల, డిసెంబర్ 18: దుమ్ముగూడెం మండలంలోని సీతానగరం గ్రామం వద్ద సోమవారం భగీరథ పైప్‌లైన్ లీక్ అవడంతో పర్ణశాల భగీరథ కేంద్రం వద్ద నీటిని నిలిపి వేశారు. భగీరథ నీరు సరఫరా రెండు రోజులు నిలుపుదల చేస్తామని సిబ్బంది తెలిపారు.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

భద్రాచలం, డిసెంబర్ 18: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని వల్లీ దేవసేన సుబ్రమ్మణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని సోమవారం సాయంత్రం శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5గంటలకు అర్చకులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, రుద్రాభిషేకం జరిపారు. అనంతరం మహిళా భక్తులతో నాగదేవతకు ఆలయ అర్చకులు బైరవభట్ల వెంకట రత్నం కుంకుమార్చన నిర్వహించి, భక్తులకు అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ ముక్క అందజేశారు. సాయంత్రం వల్లీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామివారి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల అధినేత దివంగత మాగంటి సూర్యం కుమారులు ప్రసాద్‌బాబు, రమేశ్‌బాబు, భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

## భద్రాద్రి కవి తాతోలుకు సత్కారం

భద్రాచలం, డిసెంబర్18: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో జరిగిన ప్రపంచ తెలుగు సాహిత్య, కళా ఉత్సవాల్లో ప్రతిభ కనపరిచిన భద్రాద్రి కవి తాతోలు దుర్గాచారిని సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహితి ప్రధాన గౌరవ సలహాదారు జీఎస్ శంకరరావు, గాదె మాధవరెడ్డి, చారుగుళ్ల శ్రీనివాస్ సోంపాక సీత, బీజేఎల్పీ దాసు దుర్గాచారిని అభినందించారు.



దుర్గాచారిని సత్కరిస్తున్న కళావేదిక సభ్యులు

## గురుదేవ్ విద్యాలయంలో వందేవిశ్వమాతరం

చర్ల, డిసెంబరు 18: ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా, వంద దేశాల్లో ఉన్న తెలుగు సంఘాల సమన్వయంతో వందేవిశ్వమాతరం పేరుతో శాంతి సద్భావన యాత్రలో భాగంగా స్థానిక గురుదేవ్ విద్యాలయంలో సోమవారం తానా అమ్మా నాన్న గురువు శతక పద్యార్చన నిర్వహించారు. కార్యక్రమంలో చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మశతకం, నాన్నశతకం, గురువు శతకాలలోని పద్యాలను గురుదేవ్ విద్యాలయం విద్యార్థులు ఆలపించారు. కార్యక్రమంలో హెచ్ఎం హెచ్‌జీవీ ప్రసాద్, ఉపాధ్యాయులు విశాల, విజయరాణి, నాగేంద్ర, హేమలత, కుమారి సంధ్య పాల్గొన్నారు.




పద్యపఠనంలో పాల్గొన్న విద్యార్థులు

## నేడు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

దుమ్ముగూడెం, డిసెంబర్ 18: మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులకు బుధవారం బస్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ముత్యాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్‌జిరాక్స్, ఐడీ కార్డు సర్వీస్ చార్జి కోసం రూ.50లు తీసుకుని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించే బస్‌పాస్ మేళాలో పాల్గొనాలన్నారు.

## 3,385 మంది రైతులకు రైతుబంధు జమ

దుమ్ముగూడెం, డిసెంబర్ 18: మండలంలో 3,385 మంది రైతులకు రూ.1,03,63,727 జమ అయ్యాయని వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 17,117 మంది రైతులకు రైతుబంధు రూ.23కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమకావాల్సి ఉండగా ఈనెల 9న ప్రారంభమై నేటివరకు 3,385 మందికి మాత్రమే నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని తెలిపారు.

## దాతలు ఆదుకోండి..

మణుగూరుటౌన్, డిసెంబర్ 18: రెండూ కిడ్నీలు చెడిపోయి మంచానికే పరిమితమై కుటుంబ పోషన భారమై ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. ఏడూళ్ల బయ్యారం ఎస్సీ కాలనీకి చెందిన మేకల రామకృష్ణ (26) తన రెండు కిడ్నీలు చెడిపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. దీంతో వారానికి మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇద్దరు చిన్న పిల్లలు ఉండడంతో కుటుంబ భారం మొత్తం రామకృష్ణ భార్యపై పడింది. ఇప్పటి వరకు రూ.2లక్షల వరకు ఖర్చయ్యిందని, ఇక తమ వద్ద ఆస్పత్రుల ఖర్చులకు కూడా డబ్బులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు ముందుకు వచ్చి ఆపన్నహస్తం అందించాలని కోరుతున్నారు. సాయం చేయదలచినవారు ఫోన్ నెంబరు 9502139435 ను సంప్రదించాలన్నారు.